సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 4-7-2025

సంపుటి: 21 సంచిక: 87

పేజీలు: 8 వెల: రూ.1


# విలువలే ప్రాణప్రదం.. విధేయతే జీవననైజం



- మచ్చలేని నాయకులు కొణిజేటి రోశయ్య
- మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

విలువలే ప్రాణప్రదం, విధేయతే జీవననైజమని శర్వాణి వ్యవస్థాపక అధ్యక్షులు అంధవరపు సూరిబాబు అన్నారు. నరసన్నపేట శర్వాణి విద్యాలయంలో సూరిబాబు ఆధ్వర్యంలో తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి సూరిబాబు పుష్పాంజలి ఘటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ 2004-09 రోశయ్యతో పాటు తాను కూడా శాసనసభ్యుడుగా - మిగతా చివరి పేజీలో

- సాంఘిక సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించారు
- ఒకరు శ్రీకాకుళంలో పని చేసి వెళితే..
- ఇంకొకరు ఆయన స్థానంలో వచ్చినవారు
- ఇరువురి పాపం పండినట్లే..
- ఏసీబీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం



# ఇద్దరూ ఇద్దరే..

## అక్రమాల్లో ఆరితేరినవారే!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం సాంఘిక సంక్షేమ శాఖ ఏం పుణ్యం చేసుకుందో గానీ.. ఈమధ్య కాలంలో తరచూ పత్రికల్లో పతాకశీర్షికై కూర్చుంటోంది. పేరుకు సోషల్ వెల్ఫేర్ అయినా.. ఇక్కడ సంక్షేమమంతా ఉద్యోగులు, అధికారులదేనన్న విషయం అందరికీ తెలిసిందే. దీనికి అక్కడక్కడ కొన్ని మినహాయింపులు ఉంటే ఉండొచ్చు గానీ.. ఈసారి మాత్రం శ్రీకాకుళం సోషల్ వెల్ఫేర్ రాష్ట్రస్థాయి శీర్షికైంది. ప్రస్తుతం ఈ జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా పని చేస్తున్న దాసరి మధుసూదనరావు, మొన్నటివరకు ఇక్కడ డీడీగా పని చేసి బదిలీపై వెళ్లిపోయిన వై. విశ్వమోహన్‌రెడ్డిలపై ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీషను విచారణ అధికారిగా నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

### మధుసూదన్‌పై గతంలోనూ ఏసీబీ కేసు

సుమారు ఆరేళ్ల క్రితం నెల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా పని చేస్తున్న రోజుల్లో ఆదాయానికి మించిన ఆస్తులున్నాయంటూ ఏసీబీ నమోదు చేసిన కేసులో మధుసూదనరావు సస్పెండయ్యారు. నెల్లూరు టౌన్‌లో మూడుచోట్ల, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ వంటి ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినప్పుడు నెల్లూరులోని ఆయన నివాసంలో కేజీ బంగారం, కేజిన్నర వెండి నగలు లభ్యమయ్యాయి. అలాగే గుంటూరులో రెండు భవంతులు, ఆరు ఇళ్ల స్థలాలు, రెండు కార్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ మేరకు ఆదాయానికి మించి కోట్లలో ఆస్తి కలిగి ఉన్నారంటూ ఆయనపై కేసు నమోదైంది. ఆ తర్వాత ఏం జరిగిందన్న విషయం ఇక్కడెవరికీ తెలియదు గానీ.. గత వైకాపా ప్రభుత్వంలో తన శాఖకే చెందిన మంత్రి వద్ద ఓఎస్‌డీగా పని చేశారని, ఈ కాలంలో జరిగిన అవకతవకలపైనే ప్రస్తుతం ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని తెలుస్తోంది. ఇక విశ్వమోహన్‌రెడ్డి ఇటీవల బదిలీల వరకు ఇక్కడే పని చేశారు.

### పనిచేసిన చోటల్లా ఫిర్యాదులే..

ఇక విశ్వమోహన్‌రెడ్డి శ్రీకాకుళంలో పనిచేసిన కాలంలో ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. స్వయంగా ఆ శాఖ - మిగతా చివరి పేజీలో

# కౌన్సిలింగ్ అబద్ధం..

# అన్యాయం నిజం!

- జీవో నెంబరు 6ను ఫాలో కాని డీఎంహెచ్‌వో
- రోస్టర్‌లో మొదటి వరుసకు మొండిచెయ్యి
- ఆధారాలు సమర్పించిన సాయిరాం
- రీకౌన్సిలింగ్ కోసం కలెక్టర్‌కు విన్నపం

"జి.ఈశ్వరం, బి.ఉషారాణి, సీహెచ్ ప్రమీల, జి.అమ్ములు, జె.ఆదిలక్ష్మి, రుప్ప తులసికుమారి, ఆర్.స్వాతి, ఎస్.పార్వతి, జి.కుమారి, జి.యమున, జి.రేణుకా లావణ్య, పి.రోజా అను మేము శ్రీకాకుళం వార్డు హెల్త్ సెక్రటరీలుగా గత నెల 29, 30 తేదీల్లో జరిగిన బదిలీ కౌన్సిలింగ్‌లలో పాల్గొన్నాం. మమ్మల్ని వార్డు నుంచి వార్డుకు బదిలీ చేయాల్సివుండగా, దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. దయచేసి రీకౌన్సిలింగ్ జరపాల్సిందిగా కోరుతున్నాం."

*- ఇది డీఎంహెచ్‌వోకు సచివాలయ గ్రేడ్-3 ఏఎన్ఎంలు చేసుకున్న విన్నపం.*

"బొంపాడ ఉషారాణి అను నేను శ్రీకాకుళం నగరంలో వార్డు హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్నాను. ఇటీవల జరిగిన బదిలీలో నన్ను పొందూరు మండలం రాపాక గ్రామానికి పంపించారు. బదిలీ కౌన్సిలింగ్‌లో నా సీరియల్ నెంబరు 532. జీవోఎంఎస్ నెంబరు 6 ప్రకారం నా బదిలీ అర్బన్‌లో వార్డు నుంచి వార్డుకు మాత్రమే జరగాలి. అలా కాకుండా పొందూరు మండలం పంపారు. మీరు న్యాయం చేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాను."

*- ఇదీ మరో గ్రేడ్-3 ఏఎన్ఎం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు చేసుకున్న దరఖాస్తు.*





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమగ్రంగా పరిశీలిస్తే వార్డు సచివాలయాల్లో పని చేసిన గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని తేలిపోయింది. మొత్తం 605 మంది ఏఎన్ఎంలలో మూడొంతులకు పైగా అన్యాయం జరిగిందని ఎన్జీవో సంఘ నాయకుడు హనుమంతు సాయిరాం గ్రేడ్-3 ఏఎన్ఎంలతో పాటు గురువారం జిల్లా కలెక్టర్‌ను కలవడం ఇందుకు నిదర్శనం. అర్బన్‌లో పనిచేసే గ్రేడ్-3 ఏఎన్ఎంలకు అర్బన్‌లోనే మరో సచివాలయానికి బదిలీ చేయాలి. అలాగే రూరల్‌లో పని చేస్తుంటే.. సొంత మండలం కాకుండా మరో చోటకు బదిలీ చేయొచ్చు. కానీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం అర్బన్‌లో ఉండే ఖాళీలను కూడా రూరల్‌లో పని చేసిన గ్రేడ్-3 ఏఎన్ఎంలతో భర్తీ చేశారు. దీనిపై కౌన్సిలింగ్ చివరిలో దుమారం రేగడం వల్ల ఆ సమయం నుంచి అర్బన్ నుంచి అర్బన్‌కు, రూరల్ నుంచి రూరల్‌కు బదిలీ చేశారు. బదిలీ రోస్టర్‌లో మొదటి స్థానంలో ఉన్నవారెవరికీ అర్బన్‌లో కోరుకున్న చోటుకు పోస్టింగ్ లేకపోవడంతో రూరల్ వెళ్లిపోయారు. కానీ చివరిలో కొందరు నిలదీయడంతో - మిగతా చివరి పేజీలో



# మృత్యుధామాలు.. ఈ హోటళ్లు!



- కాశీ క్షేత్రంలో పెరుగుతున్న కొత్త సంస్కృతి
- మోక్షగామిగా ఈ నగరంపై హిందువుల విశ్వాసం
- అందుకే పెద్దసంఖ్యలో చివరి రోజులు ఇక్కడికి రాక
- మరణాన్ని ఆహ్వానిస్తూ ఈ వసతిగృహాల్లో నిరీక్షణ

పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలు నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతుంటాయి. దేశ విదేశాల నుంచి వచ్చే ఈ సందర్శకులకు వసతి సౌకర్యం కల్పించేందుకు హోటళ్లు, లాడ్జీలు, చౌల్ట్రీలను ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో నిర్వహించడం అందరికీ తెలిసిందే. కానీ విహార యాత్రలతో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి కాకుండా మరణాన్ని ఆహ్వానిస్తూ.. మోక్షం కోరుకుంటూ చాలామంది వెళ్లే ఒక ప్రాంతానికి వెళుతుంటారని తెలుసా? ఆ నగరం మన దేశంలోనే ఉందని.. అదొక ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమని తెలుసా?? అదే అతి పురాతన శైవక్షేత్రమైన కాశీ అనబడే వారణాసి నగరం. ఈ నగరంలో పలు చోట్ల మరణం ఎదురుచూసేవారు అడుగడుగునా కనిపిస్తున్నారు. ఇటువంటి వారి కోసమే ప్రత్యేకంగా హోటళ్లు, వసతి కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నారు. మోక్షం కోరుకునేవారు వీటిలో గడుపుతూ మరణానికి ఆహ్వానం పలుకుతుంటారు. అందుకే వీటికి డెత్ హోటల్స్ లేదా మృత్యు హోటళ్లుగా వ్యవహరిస్తున్నారు.



డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

కాశీ, వారణాసి, బెనారస్.. పేరు ఏదైనా దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా.. ఆది దంపతులైన శివపార్వతులు విశ్వనాథుడు, అన్నపూర్ణలుగా ఇక్కడే నివాసం ఉంటున్నారని ప్రతీతి. అందుకే హిందువులకు ఇది పరమ పుణ్యక్షేత్రంగా అనాది కాలంగా భాసిల్లుతోంది. అత్యంత ప్రాచీన నగరాల్లో ఒకటైన కాశీ క్షేత్రం ముక్తిధామంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మరణించినవారికి పునర్జన్మ అనే జీవనచక్రం నుంచి విముక్తి లభించి మోక్షం ప్రాప్తిస్తుందని హిందూ గ్రంథాలు, పురాణాల ఆధారంగా ప్రజలు విశ్వసిస్తారు. దేశవిదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు నిత్యం ఈ క్షేత్రాన్ని సందర్శించి పూజలు చేస్తారు. వారితోపాటు జీవిత చరమాంకంలో ఉన్నవారు, చనిపోవాలనుకునేవారు కూడా పెద్ద సంఖ్యలో కాశీలోనే తుదిశ్వాస వీడాలన్న కాంక్షతో ఈ పవిత్ర నగరానికి చేరుకుని మరణం కోసం ఎదురు చూస్తే ఇక్కడే కాలం గడుపుతుంటారు. ఈ కారణంతోనే కాశీలోని గంగా నదీతరంలో ఉన్న శ్మశాన వాటికల్లో ఇరవై నాలుగ్గంటలూ చితిమంటలు రగులుతూనే ఉంటాయి. హిందూ మత విశ్వాసాల ప్రకారం వారణాసిలో మరణించినవారు నేరుగా విష్ణుమూర్తి నివాసమైన వైకుంఠానికి చేరుకుంటారని నమ్మిక. అదే కాకుండా ఇతర ప్రాంతాల్లో మరణించినవారి చితాభస్మాన్ని వారి కుటుంబ సభ్యులు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వారణాసికి తీసుకొచ్చి గంగానదిలో కలపడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా చేయడం వల్ల మరణించిన తమ కుటుంబ సభ్యుల ఆత్మకు శాంతి చేకూరుతుందని భావిస్తారు.

### పెరుగుతున్న హోటళ్లు

మోక్షం కోరుకుంటూ, మరణాన్ని ఆహ్వానిస్తూ కాశీకి వచ్చి నిరీక్షించేవారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. వీరిలో పండు ముదసలివారితో పాటు దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు అధికంగా ఉంటున్నారు. సాధారణ హోటళ్లు, లాడ్జీల్లో ఇటువంటి వారికి వసతి లభించడం కష్టం. దాంతో వీరు రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లోనూ ఆవాసం ఉండటం ప్రారంభించారు. అయితే ఇటువంటి వారి కోసమే ప్రత్యేకంగా హోటల్స్ ప్రారంభమవుతున్నాయి. మరణాన్ని ఆహ్వానిస్తూ కాశీకి వచ్చే వారిని ఈ హోటళ్లు ఆహ్వానిస్తున్నాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో చివరి రోజులు గడిపే అవకాశం కల్పిస్తున్నాయి. 'మా హోటల్ మరణం కోసం వేచి ఉండే గది లాంటిది. మా అతిథుల్లో చాలామంది వ్యాధిగ్రస్తులే. వారి నుంచి రోజుకు కేవలం రూ.20 మాత్రమే అద్దె వసూలు చేస్తాం' అని ఇలాంటి ఒక హోటల్ యజమాని చెప్పారు. చాలా మంది నెలల తరబడి ఉండిపోతుంటారని ఆయన చెప్పారు. కాలక్రమంలో ఈ 'డెత్ హోటల్స్' సంఖ్య



పెరుగుతోంది. కాశీవిశ్వనాథాలయ సమీపంలో ఉన్న ముముక్షు భవన్ ఈ కోవకు చెందిన హోటళ్లలో బాగా ప్రసిద్ధి చెందింది. ఈ ఒక్క హోటల్లోనే 40 మంది వృద్ధులు మరణం కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నారు. కొందరైతే ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్నారు. లక్సా ప్రాంతంలో ఉన్న ముక్తి భవన్ కూడా ప్రసిద్ధి చెందిన హోటల్.

### మరణం ఒక వేడుక

కాశీ విశ్వనాథ్ దేవస్థానాన్ని విశ్వనాథ్ కారిడార్‌గా ఆధునికీకరించిన తర్వాత ముముక్షు భవన్‌కు కూడా కొత్త భవనం నిర్మించారు. తారా సంస్థాన్, ఉదయ్‌పూర్‌లోని నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ భవన్‌లో 40 మంది వరకు ఉచిత వసతి, భోజనం వైద్య సౌకర్యం కల్పిస్తున్నారు. వైద్యులు, నర్సులు, కౌన్సెలర్లు 24 గంటలు అందుబాటులో ఉంటారు. 'ఇక్కడ ఉండే వారినుంచి మేం ఎలాంటి ఫీజు వసూలు చేయం. నివాసితులు చిన్న వంటగదిలో తమకు కావాల్సిన ఆహారం కూడా వండుకోవచ్చు' అని ముముక్షు భవన్ మేనేజర్ సునైనా ఖారే తెలిపారు. మరణాన్ని ఒక విషాదఘట్టంగా అందరూ భావిస్తారు. కానీ వారణాసిలో మరణాన్ని చాలామంది వేడుక చేసుకుంటారు. అంతిమ సంస్కారాల ఊరేగింపులో పాటలు, నృత్యాలు ఉంటాయి. గంగా నదీతీరంలోని మణికర్ణిక ఘాట్, హరిశ్చంద్ర ఘాట్ రెండింటిలోనూ సామూహిక దహన సంస్కారాలు జరుగుతాయి. ఈ రెండు ఘాట్లను ఆధ్యాత్మికంగా చాలా ముఖ్యమైనవిగా భావిస్తారు. ముముక్షు భవన్ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు నాలుగు వేల మంది ఇక్కడ విడిది చేసి పవిత్ర వారణాసిలో మరణించాలనే తమ చివరి కోరికను నెరవేర్చుకున్నారు.











• ఎడిటోరియల్

# కూటమిలో కమలం చిచ్చు!

'మా పార్టీ లేకపోతే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చేదే కాదు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే రాష్ట్రంలో కూటమికి ఎన్నికల సమయంలోనూ, ప్రభుత్వం ఏర్పాటు చేశాక అన్ని విధాలా కలిసివస్తోంది. అలాంటి మా పార్టీకి పదవుల పంపిణీలో అన్యాయం చేస్తున్నారు. మంత్రి పదవులతో సహా అన్ని రకాల రాజకీయ నియామకాల్లో తెలుగుదేశమే పెద్దన్న పాత్ర పోషిస్తూ 80 శాతం పదవులను తన్నుకుపోతోంది. 15 శాతం పోస్టులు జనసేన తీసుకుంటుండగా.. మా పార్టీ ముఖాన ఐదు శాతం పదవులు కొడుతున్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు' అని బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు విష్ణుకుమార్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేయడం కూటమి వర్గాల్లో కాక రేపుతోంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు.. తొలిఏడాది సంబరాలు చేసుకుంటున్న కూటమి సర్కారులో సెగలు రేపుతున్నాయి. కూటమిలోని మూడు పార్టీలకు సమాన అవకాశాలు ఇవ్వడం లేదంటూనే.. కూటమిలో టీడీపీ పెత్తనాన్ని ప్రశ్నించడం, కేవలం ఐదు శాతం పదవుల కోసమే జాతీయ పార్టీ అయిన బీజేపీ కూటమిలో చేరిందా? అని నిలదీయడం కచ్చితంగా కూటమి మనుగడపై ఎంతో కొంత ప్రభావం చూపుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సీట్ల సర్దుబాటులో సమన్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ కోసం.. కూటమి కోసం త్యాగాలు చేసిన క్యాడర్ ఊరుకోదని కూడా హెచ్చరించారు. విష్ణుకుమార్‌రాజు ఆరోపణలను కమలం కార్యకర్తలు బలపరుస్తుండగా.. ఆయన టార్గెట్ చేసి టీడీపీ వర్గాలు మాత్రం ఈ వ్యాఖ్యలపై మల్లగుల్లాలు పడుతున్నాయి. కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత జరిగిన పదవులు పంపిణీని పరిశీలిస్తే.. రాష్ట్ర మంత్రివర్గంలో టీడీపీకి 20 మంది మంత్రులు ఉన్నారు. అలాగే 15 శాతం దామాషా ప్రకారం జనసేనకు మూడు మంత్రి పదవులు దక్కాయి. కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బీజేపీకి మాత్రం ఒకే ఒక్క మంత్రి బెర్త్ దక్కింది. దీనిపై ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు అసహనం వ్యక్తం చేశారు. 2014లో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే ఇద్దరిని మంత్రులుగా తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా ఒక్కరినే మంత్రిగా తీసుకోవడం ఏం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ బీజేపీకి నామమాత్రపు ప్రాధాన్యం దక్కుతోందని ఆ పార్టీ క్యాడర్ వాదిస్తోంది. పైగా పరిపాలన వ్యవహారాల్లో కూడా టీడీపీ, జనసేనలకే ప్రాధాన్యత దక్కుతోందన్న అసంతృప్తి కూడా కనిపిస్తోంది. ఈ విషయాన్ని ఇంతకుముందే చాలామంది నేతలు ఇంతకాలం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురంధేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. అయితే అంతా పార్టీ అధినాయకత్వం చేతుల్లోనే ఉందని చెప్పి ఆమె తప్పించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా ఆమె టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబ సభ్యురాలు కావడం వల్ల గట్టిగా ఒత్తిడి తేలేకపోతున్నారన్న అసంతృప్తి కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆమె స్థానంలో మాధవ్ పార్టీ రాష్ట్ర పగ్గాలు చేపట్టారు. సరిగ్గా అదే సమయంలో విష్ణుకుమార్ రాజు కూటమిలో కమలానికి జరుగుతున్న అన్యాయాన్ని అందరి సమక్షంలోనే ప్రస్తావించడంపై పార్టీ క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తోంది. తనకు మంత్రి పదవి దక్కలేదన్న దుగ్ధతోనే విష్ణుకుమార్ ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని పలువురు టీడీపీ నేతలు విమర్శిస్తున్నా.. బీజేపీ లేకపోతే టీడీపీ అధికారంలోకి వచ్చేది కాదన్నట్లు ఆయన చేసిన వ్యాఖ్యలు మాత్రం టీడీపీ క్యాడర్‌కు ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఈ పరిణామాలు ముందు ముందు కూటమిపై ఎటువంటి ప్రభావం చూపుతుందన్న చర్చలు కూడా జరుగుతున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదికే కూటమి పార్టీల మధ్య విభేదాలు పొడసూపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా తొలి అడుగు పేరుతో టీడీపీ ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కానీ ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీలకు ఇందులో భాగస్వామ్యం కల్పించలేదు. మరోవైపు బీజేపీ నాయకత్వం రాష్ట్రంపై పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రెండు రాజ్యసభ సీట్లు, ఒక ఎమ్మెల్సీ సీటు దక్కించుకుంది. ఇక టీడీపీ నాయకత్వానికి సన్నిహితురాలైన పురంధేశ్వరిని తప్పించి మాధవ్‌కు అధ్యక్ష పగ్గాలు అప్పగించింది. వీటి వెనుక బీజేపీకి పెద్ద రాజకీయ వ్యూహమే ఉంది. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం కూడా టీడీపీపై ఒత్తిడి పెంచడంలో భాగమే.

## 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పై కృష్ణదాస్ కృతజ్ఞతలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా నిర్వహించిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం శ్రీకాకుళం జిల్లాలో గురువారం సాయంత్రం విజయవంతంగా ముగిసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారన్నారు. హాజరైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలకంగా పాల్గొన్న అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, అనుబంధ విభాగాల నేతలు, పార్టీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తల సహకారాన్ని ప్రత్యేకంగా గుర్తు చేశారు. జిల్లాలో వచ్చిన విశేష స్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉండాలన్నారు.


## అల్లూరి జీవితం ఆదర్శప్రాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అల్లూరి జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారు స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా తామంతా గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నేడు భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన యొక్క ఉద్యమ పోరాట స్ఫూర్తి మనందరికీ ఎంతో ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఎఎస్పీ కేవీ రమణ, డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఏవో సీహెచ్. గోపీనాథ్, సీఐలు దేవుల్లు, శ్రీనివాస్, శ్రీను, ఆర్ఐ నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## యువతకు స్ఫూర్తిప్రదాత "అల్లూరి"



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువతకు స్ఫూర్తిప్రదాత "అల్లూరి సీతారామరాజు" అని, ఆయన జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక నీలమ్మ కోలనీలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను దంతులూరి రమేష్, నల్లన మధుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన్యంలో పోరాటవీరులను తీర్చిదిద్ది బ్రిటీష్‌పై పోరాటం చేసి గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం మొదలు పెట్టిన అల్లూరి స్థానికులతో కలిసి గిరిజనులపై సాగుతున్న బ్రిటీష్ అధికారుల దౌర్జన్యాలపై తిరుగుబాటు చేశారన్నారు. అల్లూరికి ప్రజల్లో ఆదరణ పెరిగి ఉద్యమ తీవ్రరూపం దాల్చిందని, పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలో బ్రిటీష్ సైన్యానికి అల్లూరి పట్టుబడ్డారన్నారు. దేశానికి ఆయన ఎంతో సేవచేశారని, సేవల పోరాట యోధునికి స్ఫూర్తిగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆయన విగ్రహాలను పలు ముఖ్య కూడలిలో ప్రతిష్టంచటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జిలు, టీడీపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని భద్రి, చీడిపూడి, కిన్నెరవాడ, బుడితి పంచాయతీల్లో మండల టీడీపీ అధ్యక్షుడు, క్లస్టర్-6 ఇన్‌చార్జ్ కత్తిరి వెంకటరమణ శుక్రవారం పర్యటించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ సారవకోట రామారావు, మెండ శ్రీపతి, తండ్యాల జనార్దన్, నిక్కు జనార్దన్, కింజరాపు రామారావు, తర్ర లచ్చుం, మట్ట గోవిందరావు, చల్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, సారవకోట**

## నగరంలో కార్డన్ అండ్ సెర్చ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నేర నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే చర్యల్లో భాగంగా శుక్రవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టూటౌన్ సిబ్బందితో కలిసి శుక్రవారం చౌదరి సత్యనారాయణ కాలనీలోని తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో గంజాయి, మద్యం, నాటు సారా నిషేధిత పదార్థాలు, అక్రమ నిల్వలపై సోదాలు చేసి, అపరిచిత, అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలను చేపట్టి, అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను విచారించి, పాత నేరస్థులు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జెఆర్ పురం, పొందూరు పోలీసు స్టేషన్ పోలీసులు వారి పరిధిలోని పలు గ్రామాల్లో తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనధికార, సరైన వాహన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను, జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు.







## సెప్టెంబరు 25.. క్లాష్ తప్పదు

'ఓజీ', 'అఖండ 2'... 2025 ద్వితీయార్థంలో రాబోతున్న పెద్ద సినిమాల్లో ఇవి రెండూ ఉన్నాయి. ఈ రెండు సినిమాలపై అభిమానులతో పాటు చిత్రసీమ కూడా ఆశలు పెట్టుకొంది. అయితే ఈ రెండూ.. ఒకేసారి విడుదల కాబోతుండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సెప్టెంబరు 25న ఓజీని విడుదల చేస్తున్నామని ఇది వరకే నిర్మాత డివివి దానయ్య ప్రకటించారు. నిన్నటికి నిన్న మరోసారి గట్టిగా కన్‌ఫామ్ చేశారు. సెప్టెంబరు 25న ఓజీ రావడం ఖాయమని అభిమానులకు తీపి కబురు అందించారు. 'అఖండ 2' కూడా ముందు నుంచీ సెప్టెంబరు 25పైనే గురి పెట్టింది. 'ఓజీ' రిలీజ్ డేట్ పై చిత్రబృందం అంత గ్యారెంటీగా ఉందంటే, అఖండ 2 రాదేమో అనుకొన్నారంతా.

కానీ ఇప్పుడు 'అఖండ 2' నుంచి కొత్త పోస్టర్ విడుదలైంది. అందులో విడుదల తేదీ మరోసారి స్పష్టం చేసింది చిత్రబృందం. సెప్టెంబరు 25నే విడుదల అంటూ వాళ్లూ క్లారిటీగానే ఉన్నారు. దాంతో పవన్ – బాలయ్య క్లాష్ ఎలా ఉండబోతోంది? అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తోంది చిత్రసీమ.

సంక్రాంతికి రెండు మూడు సినిమాలు రావడం చూస్తూనే ఉన్నాం. కానీ అప్పుడు కూడా ఒక రోజు గ్యాప్ ఉంటుంది. ఇక్కడ అలా లేదు. ఒకే రోజు రెండు పెద్ద సినిమాలు విడుదల కావడం అభిమానుల పరంగా ఆసక్తి ఉన్నా, సినిమాకు మంచిది కాదు. ఓపెనింగ్ డే ఎఫెక్ట్ తప్పకుండా పడుతుంది. థియేటర్లు పంచుకోవాల్సివస్తుంది. దాంతో పాటు కలక్షన్లు కూడా. అయినా సరే, రెండు సినిమాలూ పోటీకి సిద్ధమయ్యాయి అంటే.. ఆలోచించుకోవాల్సిందే. నిజానికి 'విశ్వంభర' కోసం కూడా ఇదే డేట్ పరిగణించారు. 'ఓజీ' రాకుండా 'విశ్వంభర' వచ్చేదే. కానీ 'ఓజీ' ఫిక్సయ్యింది. దాంతో పాటు 'అఖండ 2' కూడా. దాంతో విశ్వంభర మరో డేట్ చూసుకోక తప్పదు.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..**






## మళ్లీ లాక్ డౌన్ వస్తే అతనితో కలిసి ఉంటా

నేను శైలజ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమైన కీర్తి సురేష్ మొదటి సినిమాతోనే మంచి హిట్ ను అందుకున్నారు. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించిన కీర్తి సురేష్ అలనాటి తార సావిత్ర జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన మహానటి సినిమాలో నటించి ఏకంగా నేషనల్ అవార్డునే సొంతం చేసుకున్నారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళంలో కూడా కీర్తి మంచి హీరోయిన్ గా గుర్తింపు అందుకున్నారు. రీసెంట్ గానే బేబీ జాన్ సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కీర్తి, ఆ సినిమాతో ఊహించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న కీర్తి ఓ వైపు స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూనే మరోవైపు ఉమెన్ సెంట్రిక్ సినిమాలు చేస్తూ మెప్పిస్తున్నారు. కాగా కీర్తి సురేష్ ప్రస్తుతం ఉప్పు కప్పురంబు అనే సినిమాలో నటించారు. శశి దర్శకత్వంలో సుహాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో కాకుండా డైరెక్ట్ గా ఓటీటీలోనే రిలీజ్ కానుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ ప్రైమ్ వీడియోలో ఉప్పు కప్పురంబు జులై 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్ లో కీర్తి సురేష్ చాలా యాక్టివ్ గా పాల్గొంటున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా యాంకర్ సుమతో జరిగిన ఓ ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు కీర్తి సురేష్. ఇంటర్వ్యూలో కీర్తిని ఒక వేళ మళ్లీ లాక్ డౌన్ వస్తే ఏ హీరోతో ఉండటానికి ఇష్టపడతారని సుమ అడగ్గా, దానికి కీర్తి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా నాని పేరు చెప్పేశారు. నాని, తన వైఫ్ అంజు, నాని కొడుకు అర్జున్ తో కలిసి ఉండటానికి ఇష్టపడతానని కీర్తి చెప్పారు. కీర్తి చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, కీర్తి సురేష్- నాని మంచి ఫ్రెండ్స్ అనే విషయం తెలిసిందే. వీరిద్దరూ కలిసి నేను లోకల్, దసరా లాంటి సినిమాల్లో నటించగా, ఆ షూటింగ్ టైమ్ లో వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. కేవలం నానితోనే కాకుండా నాని ఫ్యామిలీతో కూడా కీర్తి చాలా సన్నిహితంగా ఉంటారు. రీసెంట్ గా ఉప్పు కప్పురంబు సినిమా ట్రైలర్ చూశాక దాన్ని షేర్ చేస్తూ నాని కీర్తిని ప్రశంసిస్తూ చిత్ర యూనిట్ మొత్తానికి బెస్ట్ విషెస్ చెప్పిన సంగతి తెలిసిందే.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

## తల్లి ముందే స్మోక్ చేసిన హీరోయిన్

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా తమ్ముడు. దిల్ రాజు నిర్మాణంలో రూపొందిన ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించగా, ఆ ముగ్గురు హీరోయిన్లూ తమ్ముడు సినిమా కోసం ఒక్కో ప్రత్యేక టాలెంట్‌ను కొత్తగా నేర్చుకున్నారు. తమ్ముడు సినిమా కోసం వర్ష బొల్లమ్మ కిక్ బాక్సింగ్ నేర్చుకోగా, మరో హీరోయిన్ సప్తిమిగౌడ తన క్యారెక్టర్ కోసం గుర్రపు స్వారీ నేర్చుకున్నారు. కానీ మరో కీలక పాత్రలో నటించిన స్వసిక విజయ్ మాత్రం తమ్ముడు సినిమా కోసం ఓ స్పెషల్ సవాల్ ను స్వీకరించారు. తమ్ముడు సినిమాలోని తన పాత్ర కోసం ఆమె స్మోకింగ్ ను అలవాటు చేసుకున్నారట. తన క్యారెక్టర్ ప్రిపరేషన్ లో భాగంగా తాను స్మోక్ చేయడం నేర్చుకోవాలని డైరెక్టర్ శ్రీరామ్ వేణు తనకు చెప్పారని స్వసిక వెల్లడించారు.

దాని కోసం తాను ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేశానని, ఆఖరికి తన తల్లి ముందు కూడా తాను స్మోక్ చేశానని, ఇదంతా తన జాబ్ లో భాగమని తన తల్లికి చెప్పానని స్వసిక తెలిపారు. సినిమాలో మీరు చూసేది నిజమైన సిగార్లేనని, సినిమా మొత్తమ్మీద ఓ ఐదు సీన్లు మినహాయించి ప్రతీ సీన్ లోనూ తాను స్మోక్ చేస్తూనే కనిపిస్తానని, ఆ వాసనకు వాంతులు, తలనొప్పి కూడా వచ్చాయని ఆమె పేర్కొన్నారు. మొత్తానికి తమ్ముడు సినిమా కోసం శ్రీరామ్ వేణు ప్రతీ హీరోయిన్‌కీ ఓ స్పెషల్ మ్యానరిజంను ఇచ్చినట్టు అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో నితిన్‌కు అక్కగా లయ నటిస్తుండగా, ఆమె కూడా సినిమాలో చెప్పుల్లేకుండా నటించాల్సి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే.



**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

### గూడ్స్‌షెడ్ తరలిపోతుంటే

# రాము, రవి ఏం చేస్తున్నారు?

**- వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్**



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస రైల్వే గూడ్స్‌షెడ్ హరిశ్చంద్రపురానికి తరలిపోతుంటే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఏం చేస్తున్నారని నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. స్థానిక వైకాపా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వే గూడ్స్‌షెడ్‌పై ఆధారపడి 11 గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి కుటుంబాలు తరాలుగా జీవనం సాగిస్తున్నారని, ఆమదాలవలసలో మిగిలిన ఏకైక జీవనోపాధిని కూడా ఇప్పుడు కేంద్రమంత్రి తన కుటుంబ స్వార్ధం కోసం తరలించుకుపోతుంటే, ఆమదాలవలస ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ ఉపాధి కూడా పోవడంతో ప్రజలకు వలస పోవడం మినహా వేరే గత్యంతరం లేదని, ఎమ్మెల్యే ఇప్పటికైనా మేల్కొని గూడ్స్‌షెడ్ ఆమదాలవలస నుంచి తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని చింతాడ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, పొందూరు వైస్ ఎంపీపీ ప్రతినిధి వండాన సూరపునాయుడు, వైకాపా జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, కొత్తవలస పంచాయతీ వైస్‌సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, సీర హరి, రాము, శ్రీరామ్, చిన్నబాబు, శ్రీను, గిరి తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకార కుటుంబానికి చెందిన ఉత్తరాంధ్ర యువ రచయిత సురాడ ప్రసాద్ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలో కలిశారు. ప్రసాద్ రచించిన "మైరావణ" గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం-2025 లభించడం తెలుగు సాహిత్యానికి, శ్రీకాకుళం ప్రాంతానికి గర్వకారణమని మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనను హృదయపూర్వకంగా మంత్రి అభినందించారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

### ఫసల్‌బీమా యోజన పథకాన్ని

# రైతులు వినియోగించుకోవాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నందున ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నిమ్మడ క్యాంపు కార్యాలయంలో సంబంధిత గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పంట బీమా పథకం ద్వారా నష్టాన్ని అంచనా వేసి సాగు చేసిన రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేసి పరిహారం అందించనున్నట్టు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో వరి(ధాన్యం), మొక్కజొన్న (మక్కా) పంటల బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద రైతులకు సహజ ఉత్పత్తుల నుండి రక్షణ కల్పించేందుకు రైతులకు ఆర్థిక భరోసా అందివ్వనున్నట్లు తెలిపారు. రైతులు తక్కువ ప్రీమియం చెల్లించి అధిక బీమా రక్షణ పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు గోవిందరావు, జగన్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# ముందుస్తు అనుమతిలు తప్పనిసరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా వ్యాప్తంగా జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌ల నిర్వహణకు సంబంధిత పోలీసు వారి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతలు పరిరక్షణలో బాగంగా శ్రీకాకుళం జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్, ధర్నాలు నిర్వహించాలనుకునే రాజకీయ పార్టీలు, మత సంస్థలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర సంఘాల వారు వారం ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సబ్ డివిజనల్ అధికారి నిర్దేశించిన అనుమతులను, ముందస్తుగా తప్పనిసరిగా పాటించాలన్నారు. దరఖాస్తు చేసునే వ్యక్తులు వారి వివరాలు, ఎందుకు నిర్వహిస్తున్నారు, ఎంతమంది వస్తున్నారు, ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్, స్థలం.. ఇలా పలు వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలనుకొనే వారు కార్యక్రమం తేదీ, సమయం, ప్రదేశం, ప్రదేశంకు సంబంధించిన యజమాని అనుమతి పత్రం, ప్రదేశం వద్ద తీసుకునే భద్రత ఏర్పాట్లు, కార్యక్రమానికి వచ్చే మార్గాల వివరాలు పొందుపరచాలన్నారు. అదే విధంగా కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తులు వివరాలు, వారు వచ్చే మార్గం, వారి వెంట వచ్చే వాహనాల వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమానికి మైకులు, డీజే బాక్సులు పెడుతుంటే వాటి వివరాలు తెలపాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలను, ఉపన్యాసాలను, హింసాత్మక పోస్టర్లను ప్రదర్శించడం వంటివి చేయరని వ్రాతపూర్వక హామీ ఇవ్వాలన్నారు. వాటిని ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు.

# సుపరిపాలనపై సానుకూల స్పందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని 213 బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇన్‌ఛార్జి అకెన రాజారావు, రెడ్డి శివన్నారాయణ, జగన్, నాని, నాగేష్, సైని ధర్మారావు, జామి కైలాష్, అన్నెపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై కృషి చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోరింది. ఈమేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు ఎమ్మెల్యే గొండు శంకర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని, పర్మినెంట్ కార్మికులకు ఆరు డిఏలు, సరెండర్ లీవ్‌లు, వెంటనే విడుదల చేయాలని, శ్రీకాకుళం నగరపాలక సంస్థ విస్తీర్ణం అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, స్థానిక సంస్థలపై కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ఒక్కో సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, పార్థసారథి, గణేష్, మనీ, రామచంద్ర, సోగ్గాడు, సూర్యకళ, సరస్వతి, కూర్మారావు, సోషల్ మీడియా ప్రతినిధులు కళ్యాణి, తిరుమలరావు, అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు



## అధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతీయ అధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన గురువు "స్వామి వివేకానంద అని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు, విద్యావేత్త డాక్టర్ జామి బీమశంకర్ శుక్రవారం అన్నారు. స్థానిక విద్యాధరి డిగ్రీ కళాశాలలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి భీమశంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యువత సన్మార్గంలో ఉండాలన్నా, నడవాలన్నా స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలుగుజాతి గర్వపడేలా ఉండటం మన అదృష్టమని, తప్పకుండా ఆయన జీవిత సత్యాన్ని తెలుసుకుంటే ప్రతీ విద్యార్థి తమ లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో భాగంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అందించబడిన పుస్తకాలు, అవసరమైన పరీక్ష సామాగ్రిని బీమశంకర్ కుమార్తె విద్యాదరి విద్యార్థులందరికీ అందించారు. కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని ఉషరాణి, డా చింతాడ కృష్ణమోహన్, కొరడా రమేష్, కృష్ణకాంత్, మణిశర్మ, గణపతి, విద్యాధరి కళాశాల సీనియర్ ఇంచార్జి వీటి.నాయుడు, పి.భాగ్యలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉద్యమ జ్వాల అల్లూరి

(సత్యంన్యూస్, సారవకోట)

అల్లూరి124వ జయంతి సందర్భంగా సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమచరిత్రలో ఆంగ్లేయులకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరు జరిపిన సాయిధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిమంతమైన అధ్యాయమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే పోరాటం ఒకటే మార్గమని నమ్మిన అల్లూరి తన పోరాట పటిమతో బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించారన్నారు. ప్రకృతి సంపదను అనుభవించే హక్కు గిరిజనులకు ఉందని ఎలుగెత్తి చాటడంతోపాటు గిరిజనులు పోడు వ్యవసాయం పన్నును కట్టక్కర లేదన్నాడు. ఆదివాసులకు నిలువుదోపిడి చేస్తున్న బ్రిటిష్ వాళ్ళపై విల్లును ఎక్కుపెట్టాడు. అల్లూరికి సహాయం చేస్తున్నారని నెపంతో బ్రిటీష్ అధికారులు మన్యం ప్రజలకు వేధింపులు మొదలుపెట్టారన్నారు. దేశం కోసం వీరమరణం పొందిన అల్లూరి సీతారామరాజు విగ్రహం పార్లమెంట్లో ఆవిష్కరించి ఆయనకు ఘన నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ చిన్నముడు, ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు పడాలి మాదయ్య, హెచ్ఎం తంప రామారావు, జన్ని రవి, జంజిక సింహాచలం, గోకలర్ల సింహాచలం, పిడి సంజీవ్, ఒంబంగి. గౌరిష్, జన్ని దలయ్య, కొంకాడ వెంకటేష్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



## అల్లూరి త్యాగం, వీరత్వం యువతకు మార్గదర్శకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అల్లూరి సీతారామరాజు త్యాగం, వీరత్వం యువతకు మార్గదర్శకం కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతిని శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి కార్యక్రమాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య పోరాటంలో నిస్వార్థంగా పోరాడిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. అల్లూరి స్ఫూర్తితో ప్రజల్లో దేశభక్తి భావాన్ని ప్రేరేపించేందుకు జిల్లా వ్యాప్తంగా పలువురు పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ సుధాకర్ రావు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం ప్రపంచాన్ని రక్షిద్దాం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం ప్రపంచాన్ని రక్షిద్దామని లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపకులు హారికా ప్రసాద్ శుక్రవారం అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ సంచుల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా హర్షవల్లి లయన్స్ క్లబ్ సభ్యుల పిలుపుమేరకు స్థానిక కృష్ణ పార్క్ సమీపంలో అవగాహనా కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధిద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని నిర్మిద్దామన్నారు. ఈ దిశలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తే తప్పక విజయం సాధించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుందర శ్రీకాకుళం కాలుష్య రహిత శ్రీకాకుళంగా కూడా మారాలని పిలుపునిచ్చారు. 2023 సంవత్సరంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఇచ్చిన పిలుపు మేరకు ఇప్పటి అభిరుచి డిపార్ట్మెంట్ స్టోర్‌లో ఇప్పటికీ క్లాత్ బేగులను వినియోగిస్తున్నందుకు ఆ షాపు యజమాని తంగుడు అమితేష్‌ను సభ్యులు అభినందించారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా ఒక అవగాహన కరపత్రాన్ని విడుదల చేసి, శ్రీకాకుళం పట్టణంలో పౌరులకు, అన్ని వాణిజ్య సముదాయాలకు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. భవిష్యత్తులో పర్యావరణహితం కోసం ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలకు సహకరించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథనాయుడు, ఆర్సీ డా.చింతాడ కృష్ణమోహన్, తర్లాడ అప్పలనాయుడు, కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ పార్వతీశ్వరరావు, మణిశర్మ, మాధవి, కార్యవర్గ సభ్యులు సుమన్, నిహార్ హారిక, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను తెలుసుకోవడమే 'సుపరిపాలన' లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిం చే విధంగా చొరవ చూపడమే 'సుపరిపాలనలో తొలి అడుగు' లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు శుక్రవారం బందరువానిపేట, కళింగపట్నం, కే.మత్స్యలేశం తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అదేవిదంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిన వివరించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే, వైకాపా నేతలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసాం కాబట్టే దైర్యంగా తొలిఅడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు ఛైర్మన్ అరవల రవీందర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రో॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## తెలుగువారి శౌర్య పరాక్రమాలను చాటిచెప్పిన యోధుడు అల్లూరి



❖గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు
❖శాఖా గ్రంథాలయంలో సీతారామరాజు జయంతి

(సత్యంన్యూస్, లావేరు)

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో తెలుగు జాతి, తెలుగువారి శౌర్య పరాక్రమాలను ప్రపంచానికి చాటిచెప్పిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాలలో పంచాయితీ కోర్టులు ఏర్పాటుచేసి గ్రామాల్లో తగవులు ప్రభుత్వానికి వెళ్లకుండా వారే పరిష్కరించుకునే ఏర్పాటు చేశారన్నారు. మద్యపాన నిషేధం, స్వదేశీ వస్త్రధారణ వంటి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లిన మహనీయుడని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన ఏ.సత్యనారాయణకు గ్రంథాలయం తరపున బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌన్సిలింగ్ అబద్ధం.. అన్యాయం నిజం!

(మొదటిపేజీ తరువాయి)

వారికి మాత్రం అర్బన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. దీనివల్ల ముందువరుసలో ఉండాల్సినవారు నష్టపోయారని, కౌన్సిలింగ్ చివరలో ఉన్నవారు లబ్ధిపొందారని 'సత్యం' 'ఏఎన్ఎంల కౌన్సిలింగ్ పెంట పెంట' శీర్షికన ఇటీవల ఓ కథనం ప్రచురించింది. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి ఇదే విషయాన్ని విన్నవించారు. మళ్లీ రీకౌన్సిలింగ్ చేయాలని కోరారు. అందుకు జీవోలు, తమకు బదిలీ అయిన ప్రాంతానికి సంబంధించిన ఆర్డర్లు చూపించారు. నగరంలో దండివీధి సచివాలయ పరిధి 29, 31 వార్డులకు హెల్త్ సెక్రటరీ (గ్రేడ్-3 ఏఎన్ఎం)గా పనిచేస్తున్న సిరుగుడి పార్వతికి లావేరు బదిలీ చేశారు. మంగువారితోట సచివాలయంలో పనిచేసిన చింతాడ ప్రమీలకు పొందూరు మండలం కనిమెట్ట పంపేశారు. దమ్మలవీధి హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్న శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లి విజయకుమారికి కిల్లిపాలెం-2కు బదిలీ చేశారు. తుమ్మిడి మీనాక్షి బాకర్ సాహెబ్‌పేట సచివాలయంలో పని చేస్తుండగా, ఈమెకూ అర్బన్‌లో స్థానం కల్పించలేదు. జమ్మాన ఆదిలక్ష్మి కలెక్టర్ బంగ్లా రోడ్డులో హెల్త్ సెక్రటరీగా పని చేస్తుండగా, ఆమెకు ఎచ్చెర్ల మండలం ధర్మవరం బదిలీ చేశారు. చంపాగల్లివీధి సచివాలయంలో




పని చేస్తున్న రుప్ప తులసికుమారిని పొందూరు మండలం దళ్లవలసకు పోస్టింగ్ ఇచ్చారు. గురుగు కుమారి అర్బన్‌లో 26వ వార్డులో పనిచేస్తుండగా, ఆమె శ్రీకూర్మం-1 కోరుకున్నారు. ఆ మేరకు ఆమెకు బదిలీ చేశారు. కానీ అదే శ్రీకూర్మం-1కు వేరే వారికి కూడా బదిలీ చేసినట్టు ఆర్డరిచ్చారు. ఇప్పుడు ఈ ఇద్దరిలో ఎవరు శ్రీకూర్మంలో ఉంటారో తెలియదు. కౌన్సిలింగ్ రోస్టర్‌లో డేటాఫ్ జాయినింగ్, వయసు వంటివాటి ఆధారంగా ముందువరుసలో ఉన్నవారికి సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వమని, అర్బన్‌లో పనిచేసినవారు మళ్లీ అర్బన్‌లో కోరుకోకూడదని జూమ్ కౌన్సిలింగ్‌లో చెప్పిన డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలోని కౌన్సిలింగ్ బోర్డు పోనీ ఆ మాటమీదైనా నిలబడి అందరికీ ఒకేలా చేసిందా.. అంటే అదీ లేదు. సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ఇచ్చిన జీవోఎంఎస్-6 తమకు అర్థం కాలేదని, అందుకే ఈ విధంగా చేశామని చెప్పుకోవచ్చు. కానీ కొందరికి సొంత మండలాలు ఇవ్వక, ఇంకొందరికి అర్బన్‌లో స్థానం కల్పించక ఇష్టారీతిన బదిలీలు చేపట్టడం వల్ల ఇక్కడ కచ్చితంగా పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారివుంటాయన్న అభిప్రాయం బలపడుతోంది. అందుకే రీకౌన్సిలింగ్ చేయాలని వీరు పట్టుపడుతున్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలకు

## షాకిచ్చిన విజయనగరం కలెక్టర్

- నిబంధనలు ఉల్లంఘించినవారిపై ఆగ్రహం
- పాఠశాల భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు
- స్కూల్స్ ఇచ్చిన హామీలను పక్కాగా పరిశీలించాలి
- ఆయా సంస్థలను సీజ్ చేయాలని ఆదేశం



(సత్యంన్యూస్, విజయనగరం)

విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కార్పొరేట్ విద్యాసంస్థలకు గట్టి షాక్ ఇచ్చారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించాల్సిన నిబంధనలను ఉల్లంఘించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భాష్యం, సన్ స్కూల్, బీసెంట్ స్కూల్స్‌తో సహా ఆరు పాఠశాలలపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంస్థలను సీజ్ చేయాలని ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయమని ఆదేశించడం విద్యారంగంలో కలకలం రేగింది. అధికారులు ఈ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఆర్టీఈ అమలు, స్కూల్లో మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది అర్హతలు, శానిటేషన్, భద్రతా ప్రమాణాలపై లోతైన దర్యాప్తు చేశారు. తనిఖీల్లో సీట్ల కేటాయింపులో అవకతవకలు, సౌకర్యాల లేమి, అనర్హతా సిబ్బంది వంటి లోపాలను గుర్తించారు. అధికారులు చేపట్టిన చర్యలతో ఒత్తిడికి గురైన కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వెనక్కి తగ్గాయి. తక్షణమే ఆర్టీఈ చట్టాన్ని అమలు చేస్తామని, నిబంధనలకు అనుగుణంగా సీట్ల కేటాయింపు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. కార్పోరేట్ స్కూల్స్ ఇచ్చిన హామీలను కఠినంగా పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులకు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అంబేద్కర్ చేపట్టిన చర్యలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక న్యాయాన్ని అందించడంలో కీలకంగా మారాయని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. కలెక్టర్ అంబేద్కర్ చేపట్టిన చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం తెలిపారు. ఇదే తరహాలో ఇతర జిల్లాల కలెక్టర్లు కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 10న గురుపౌర్ణమి పూజలు

(సత్యంన్యూస్, పలాస)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరం వద్ద ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ బాబా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గురుపౌర్ణమి రోజు ఉదయం ఐదు గంటల నుంచి ప్రధాన అర్చకులు ధర్మపురి వాయునందన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

## యూకే ఎంఐఎంలో జాగృతికి డిగ్రీ పట్టా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ ప్రసిద్ధగాంచిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయం లండన్ బిజినెస్ స్కూల్ (యుకె)ల్లో జిల్లా పరిషత్ చైర్‌పెర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి పిరియా విజయ సాయిరాజ్ కుమార్తె జాగృతి మాస్టర్ ఇన్ మేనేజ్మెంట్‌లో హానర్స్ డిగ్రీ పట్టాను పొందారు. గురువారం యూనివర్శిటీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా మాస్టర్ ఇన్ మేనేజ్మెంట్‌లో హానర్స్‌లో డిగ్రీ పూర్తిచేసిన జాగృతికి డిగ్రీని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్ హజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాస్టర్ ఇన్ మేనేజ్మెంట్‌లో హానర్స్‌లో డిగ్రీ పూర్తిచేసి పట్టా పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. చదువుపై జాగృతికి ఉన్న ఆసక్తిని కొనియాడుతూ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కాంక్షించారు.




## ఇద్దరూ ఇద్దరే.. అక్రమాల్లో ఆరితేరినవారే!

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో పని చేస్తున్న వార్డెన్లే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతితో విచారణ కూడా జరిపించారు. తన శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొన్ని పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఒక దళితుడి నుంచి రూ.2.30 లక్షలు లంచం తీసుకున్నట్టు విశ్వమోహన్‌రెడ్డిపై ఫిర్యాదు అందింది. అయితే లంచం ఇస్తుండగా చూసినవారెవరూ లేరన్న ఒక్క కారణంతో ఈ కేసును నీరుగార్చేశారు. తాజాగా జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో కూడా ఇదే విషయం మీద ఫిర్యాదు చేశారు. రూ.2.50 లక్షలకు ఒప్పందం కుదరగా.. ఉద్యోగం వచ్చిన తర్వాత మిగిలిన రూ.20వేలు ఇస్తానంటే కుదరదని డీడీ విశ్వమోహన్‌రెడ్డి తేల్చేయడంతో బాధితుడు ఫిర్యాదు చేయాల్సివచ్చింది. ఇక శాఖలో బదిలీలు, పదోన్నతులు, మంత్లీల కోసం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. విశ్వమోహన్‌రెడ్డి రాయలసీమ రీజియన్‌లో ఒక జిల్లాకు సోషల్ వెల్ఫేర్ డీడీగా పనిచేశారు. అక్కడ కూడా ఇటువంటి ఆరోపణలే ఉండటంతో ఆయన్ను ఆ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్ చేశారు. లైంగిక వేధింపుల కేసు కూడా ఈయనపై నమోదైంది. ఎక్కడా పోస్టింగ్ లేకపోవడంతో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పేషీలో కార్యదర్శిగా పని చేసిన రాయలసీమకే చెందిన ధనుంజయరెడ్డిని పట్టుకొని శ్రీకాకుళానికి పోస్టింగ్ తెచ్చుకున్నారని చెబుతుంటారు. ఆయన గతం, మొన్నటి వరకు శ్రీకాకుళంలో వచ్చిన ఆరోపణలపై కూడా నెల్లూరు ఏసీబీ డీఎస్పీ విచారణ చేపట్టనున్నారు.

## విలువలే ప్రాణప్రదం.. విధేయతే జీవననైజం

(మొదటిపేజీ తరువాయి)

ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. నిష్కలంక వ్యక్తిత్వం, అపార అనుభవం, నిరాడంబరత, అచ్చమైన తెలుగు ఆహార్యంతో నిండైన మనసుతో ఆయన ప్రారంభించిన నరసన్నపేటలోని శార్వాణి విద్యాసంస్థ దినదిన ప్రవర్ధమానంగా ఎదగడం చాలా సంతోషకరమన్నారు. సంస్థ డైరెక్టర్ సాయిరాణి అధ్యక్షోపన్యాసం చేస్తూ 2016 మే 31న నాటి తమిళనాడు గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా నరసన్నపేటలోని శర్వాణి విద్యాలయం ప్రారంభోత్సవం జరిగిందని గుర్తుచేశారు. నేటికి ఈ విద్యాసంస్థ నుండి ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించారని, రోశయ్య స్ఫూర్తితో, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సంస్థ ప్రిన్సిపల్ బివి రమణమూర్తి మాట్లాడుతూ సంక్లిష్టతలతో వ్యక్తిత్వం మెరుగుపడుతుందని రోశయ్య జీవితం నుండి మనం నేర్చుకోవాలన్నారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ డాక్టర్ రోశయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని, భారతదేశంలో ఒక రాష్ట్ర ఆర్థిక మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని, శాసనసభలోనూ శాసనమండలిలోనూ ప్రజా సమస్యలపై ప్రజల మనోభావాలను గూర్చి ఆయన గళం విప్పారని పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగాతో కలిసి పని చేసిన అభ్యుదయ వాది రోశయ్య అని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రెండుసార్లు, భవనం వెంకటరామిరెడ్డి వద్ద ఒకసారి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వద్ద రెండుసార్లు, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వద్ద ఒకసారి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వద్ద రెండుసార్లు ఆర్థిక మంత్రిగా పనిచేసిన అపారమైన అనుభవం ఉన్న ఘనాపాటి అని పేర్కొన్నారు. వైఎస్ మరణానంతరం సుమారు రెండు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన కొణిజేటి రోశయ్య అధిష్టానం ఆదేశించిన తక్షణమే రాజీనామా చేసి, తన నిస్వార్థ విధేయతను చాటారన్నారు. ఆయన నిబద్ధతను గుర్తించిన అధిష్టానం చెన్నై గవర్నర్‌గా ఆయనను నియమించిందని, ఐదేళ్లు ఆ పదవిలో కొనసాగిన ఆయన గవర్నర్ పాత్రను నిష్పక్షపాతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డబుల్ మర్డర్ కేసులో వీడిన మిస్టరీ

## - పోలీసులు అదుపులో నిందితుడు రామారావు -



(సత్యంన్యూస్, పలాస)

ఉద్దానంలో సంచలనం రేపిన వరుస హత్యల కేసు మిస్టరీ వీడింది. జంట హత్యల కేసును మందస పోలీసులు ఛేదించి నిందితుడు పలాస మండలం మహాదేవపురానికి చెందిన ముడియా రామారావును పోలీసులు శుక్రవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ డిఎస్పీ వెంకట అప్పారావు కేసు వివరాలను వివరించారు. సోంపేట మండలం పాలవలసకు చెందిన గోకర్ణ ఈశ్వరరావు, రాజేశ్వరిల హత్య కేసులో చిక్కుముడి వీడిందని తెలిపారు. పాలవలసకు చెందిన గోకర్ణ రాజేశ్వరితో ఆడపడుచు భర్త రామారావు అక్రమ సంబంధం నెరిపినట్టు పేర్కొన్నారు. రాజేశ్వరి భర్త చంద్రశేఖర్ సౌదీలో ఉంటున్నట్టు తెలిపారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలని, రాజేశ్వరి అవసరాలు తీర్చుతూ అక్రమ సంబంధం కొనసాగించాడని వివరించారు. రాజేశ్వరి ఎదురింటిలో ఉన్న గోకర్ణ ఈశ్వరరావుతోనూ అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్టు తెలుసుకున్న నిందితుడు రామారావు ఆయన్ని అంతం చేయడానికి ప్లాన్ చేశాడని, పథకం ప్రకారం మే17న రాత్రి పాలవలస గ్రామదేవత సంబరాల్లో ఈశ్వరరావుకు మద్యం తాగించి సమీపంలోని జీడితోటలో రామారావు హత్య చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈశ్వరరావును హత్య చేసినట్లు రాజేశ్వరికి రామారావు తెలిపాడని, ఈశ్వరరావును హత్య చేసిన విషయం అందరికీ చెప్పేస్తానని బెదిరిస్తూ, ఆర్థిక అవసరాలు తీర్చాలని రాజేశ్వరి తరచూ రామారావును బ్లాక్‌మెయిల్ చేస్తుండేదని డిఎస్పీ తెలిపారు. దీంతో రాజేశ్వరిని హత్య చేయాలని నిర్ణయించుకొని పాలవలస నుంచి పిడి మందసలో బంధువుల ఇంటికి వచ్చిన రాజేశ్వరిని జూన్ 11న మోటార్ బైక్‌పై ఎక్కించుకొని పితాతోళి జీడితోటల్లోకి తీసుకువెళ్లినట్టు తెలిపారు. రాజేశ్వరితో కొంత సమయం గడిపిన అనంతరం ఆమెతో గొడవపడి బీర్‌బాటిల్‌తో కొట్టి చంపినట్లు విచారణలో నిందితుడు రామారావు అంగీకరించినట్లు డిఎస్పీ తెలిపారు. రాజేశ్వరి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి జంటహత్యలకు పాల్పడిన నిందితుడిపై హత్యా నేరంతో పాటు పలు సెక్షన్ల కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు కాశీబుగ్గ డిఎస్పీ వెంకట అప్పారావు వెల్లడించారు. దీని కోసం కాశీబుగ్గ సీఐ, మందస ఎస్ఐతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేసి కేసును ఛేదించినట్టు తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, సోంపేట సీఐ మంగరాజు, మందస ఎస్ఐ కృష్ణప్రసాద్, సిబ్బంది గవరయ్య, షన్ముఖరావు, ప్రసాద్, రామారావు, లక్ష్మణమూర్తి తదితరులు ఉన్నారు.





# అల్లూరి స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని భావితరాలకు అందించాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అన్నారు. దాస్య శృంఖలాలతో స్వేచ్ఛకు దూరమైన సమాజంలో పోరాట జ్వాలలు రగిలించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని గుర్తుచేశారు. అల్లూరి జయంతి సందర్భంగా పీఎన్ కాలనీ జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్యం ప్రజల కోసం బ్రిటిష్ పాలకులకు ఎదురు తిరిగిన అల్లూరి పోరాట పంథా చిరస్మరణీయమన్నారు. తెలుగు జాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచిన మన్యం వీరుడు అల్లూరి పోరాట స్ఫూర్తిని, అణగారిన వర్గాలకు అండగా నిలిచే తత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు,



సురేష్‌కుమార్, పెద్దపాడు శంకర్, ముంగి జగదీశ్, గుమ్మడి శాంతారావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు పైడి మురళి, శ్రీకాకుళం పట్టణ నాయకులు పల్లె శ్రీనివాస్, కాకర్ల ప్రదీప్, తురుపూరి నవీన్, జిల్లా

ఈ కార్యక్రమంలో దంతులూరి రమేష్‌రాజు, నల్లాన మధు, జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కొండా ఉదయ్‌శంకర్, జిల్లా సంయుక్త కార్యదర్శిలు గురు ప్రసాద్ గౌడ్, కొంద్రా వరప్రసాద్, ఎండీ రఫీ, జిల్లా నాయకులు పాండ్రంకి రాజేష్ నాయుడు, వాడవలస నాయకులు బగ్గ అప్పలరాజు, ధనుంజయ, మణి, పైల శ్రీను, గొట్టా సురేష్, జనసేన జిల్లా వీరమహిళలు బొడ్డు మోహన్ లక్ష్మి, గొర్లె అనురాధ, కలగ లక్ష్మి, అనాపు లత, ఎం.లక్ష్మి, డోల లక్ష్మి, ఉప్పాడ రాజేశ్వరి, పప్పు లక్ష్మి తదితరులు హాజరయ్యారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.